కర్షకుని రుణం తీర్చుకోలేనిది

వైఎస్సార్ రైతు భరోసా పీఎం కిసాన్ సభలో ఎమ్మెల్యే తెల్లం బాలరాజు భావోద్వేగం


సేంద్రియ ఎరువుల స్టాల్ ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

కొయ్యలగూడెం : కన్నతల్లి రుణం, కర్షకుని రుణం తీర్చుకోలేనిది అని, దైవం మానుష రూపేణా అనే పదానికి అర్థం వారేనని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పేర్కొన్నారు. కొయ్యలగూడెం ఏఎంసీ యార్డ్ ప్రాంగణంలో గురువారం నిర్వహించిన వైఎస్సార్ రైతు భరోసా పీఎం కిసాన్ కార్యక్రమానికి హాజరైన బాలరాజు రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ భావోద్వేగానికి గురి అయ్యారు. రైతు బిడ్డనైన తాను కూడా వ్యవసాయం చేసుకుంటున్నానని అది గర్వంగా భావిస్తానని అన్నారు. నాలుగేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో రూ.3,923 కోట్లు వైఎస్సార్ భరోసా పీఎం కిసాన్ ద్వారా రైతుల అకౌంట్‌లో జమ చేయడం జరిగిందన్నారు. ఒక్కో రైతుకు రూ.61,500 లబ్ధి చేకూరిందన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా భూ హక్కు కలిగిన రైతులతో పాటు పోడు భూములను సాగు చేసుకుంటున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ రైతులకు ఏటా రూ.13,500 రైతు భరోసా సహాయం కలగజేస్తున్న ఏకైక ప్రభుత్వం మనదేనని అన్నారు. జిల్లాలో అత్యధికంగా పోడు భూముల సాగు చేస్తున్నది పోలవరం నియోజకవర్గంలోని వారేనని అన్నారు. ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖలైన ఉద్యాన శాఖ జెడ్పీఎన్ఎఫ్, ఏపీఎంఐపీ, ఐసీడీఎస్, వైద్య ఆరోగ్య శాఖ, నాచురల్ ఫార్మింగ్, తదితర శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్టాల్స్‌ని ఆయన ప్రారంభించి పరిశీలించారు. జెడ్పీటీసీలు, సామంతపూడి సూరిబాబు, మల్లాన వసంతరావు, మొడియం రామతులసి, ఎంపీపీ కారం శాంతకుమారి, రాష్ట్ర ఫుడ్ కమిషన్ మెంబర్ గంజిమాల దేవి, రైల్వే బోర్డు మెంబర్ బి.వెంకటేశ్వరరావు, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం, పోలవరం, టి.నరసాపురం వైఎస్సార్ సీపీ మండలాల అధ్యక్షులు గొడ్డటి నాగేశ్వరరావు, వామిశెట్టి హరిబాబు, శ్రీను రాజు, బుగ్గా మురళి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శులు దాసరి విష్ణు, ఆరేటి సత్యనారాయణ, ఎస్కే సయ్యద్ బాజీ, వైస్ ఎంపీపీ మట్ట వనజ లక్ష్మి, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ చిక్కాల దుర్గాప్రసాద్, సర్పంచ్ ముప్పిడి విజయకుమారి, అగ్రికల్చర్ అడ్వైజర్ కమిటీ మండల చైర్మన్ గంటా సీతారామయ్య, నియోజకవర్గ మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షుడు గేలం త్రివిక్రమ సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

బాబుది మేనిఫెస్టో కాదు.. మాయా ఫెస్టో

బుట్టాయగూడెం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్న పథకాలతో ప్రతిపక్ష నేత చంద్రబాబుకి మతిభ్రమించడంతో పాటు వెన్నులో వణుకు పుడుతోందని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. గురువారం సాయంత్రం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ చంద్రబాబు ఇటీవల ప్రకటించింది మేనిఫెస్టో కాదని అదొక మాయాఫెస్టో అని విమర్శించారు. ప్రజలను మోసం చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని అన్నారు. మేనిఫెస్టో అంటేనే అర్థం తెలియని నాయకుడు ఎవరైనా ఉన్నారంటే అది చంద్రబాబు ఒక్కడే అని విమర్శించారు. ఎన్నికల సమయంలోనే మేనిఫెస్టో ప్రకటించడం, ఆ తరువాత ఆ మేనిఫెస్టోను చెత్తబుట్టలో వేయడం బాబుకు అలవాటేనని అన్నారు. గతంలో చంద్రబాబు పెట్టిన 600 హామీలు తుంగలో తొక్కారని అన్నారు. చంద్రబాబు మాయాజాలాన్ని నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. ఇచ్చిన హామీలను నాలుగేళ్లలో 98 శాతానికిపైగా అమలు చేసి దేశానికే ఆదర్శంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని అన్నారు. రామరాజ్య పాలన సాగిస్తూ తండ్రి వైఎస్సార్ ఆశయ సాధన కోసం పనిచేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ కోత వేళలు

టి.నరసాపురం : విద్యుత్ మరమ్మతులు, ట్రీకటింగ్ నేపథ్యంలో శుక్రవారం ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ కేఎం అంబేద్కర్ తెలిపారు. టి.నరసాపురం సెక్షన్ల పరిధిలోని టి.నరసాపురం, వెలగపాడు సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

సీనియర్ సిటిజన్స్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం


నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేస్తున్న దృశ్యం

చింతలపూడి : పట్టణ సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చిల్లపల్లి రామ్మోహన్‌రావు, గౌరవ అధ్యక్షుడిగా గోలి చంద్రశేఖర్‌రెడ్డి, కార్యదర్శిగా చుండూరి అబ్బయ్య, కోశాధికారిగా పక్కాల వెంకటేశ్వరరావు, డైరెక్టర్లుగా గోలి ప్రభాకర్‌రెడ్డి, జల్లిపల్లి వైకుంఠరావు, మందపాటి కృష్ణారెడ్డి తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం అధ్యక్షుడు మోహన్‌రావు మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్ సంక్షేమం కోసం కృషి చేస్తానని తెలిపారు.

చింతలపూడి ఎంపీడీవోగా మురళీకృష్ణ


ఎం. మురళీ కృష్ణ, ఎంపీడీఓ

చింతలపూడి : చింతలపూడి మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఎం.మురళీ కృష్ణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా పనిచేసిన మణికుమారి లింగపాలెం ఏవోగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మురళీ కృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు చేరవేయడానికి కృషి చేస్తానని తెలిపారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం


దాత రామకృష్ణ దంపతులకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ ఏఈఓ రాజు

ద్వారకాతిరుమల : శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు తాడేపల్లిగూడెంకు చెందిన నూనె రామకృష్ణ, కనకదుర్గా భాయి దంపతులు గురువారం రూ. 1,01,000 విరాళంగా అందజేశారు. ముందుగా వారు స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాత దంపతులకు ఆలయ ఏఈఓ కేఎల్ఎస్ రాజు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

శ్రీవారి కొండపై అల్పాహారశాల

శ్రీవారి కొండపైన బుకింగ్ కౌంటర్ల వద్ద శ్రీ పద్మావతి హోటల్‌ను ఆలయ అధికారులు గురువారం ప్రారంభించారు. గత పాటదారుడి లీజు సమయం ముగియడంతో హోటల్ నిర్వహణ బాధ్యతను దేవస్థానమే చేపట్టింది. ఈ క్రమంలో ఆలయ అధికారులు హోటల్‌ను ప్రారంభించగా, సిబ్బంది భక్తులకు సేవలందించారు.

జంగారెడ్డిగూడెం సీఐగా రాజేష్


సీఐగా బాధ్యతలు స్వీకరించిన రాజేష్

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం సీఐగా పి.రాజేష్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ నుంచి ఆయన ఇక్కడకు బదిలీ అయ్యారు. ఇక్కడ పని చేస్తున్న సీఐ బాల సురేష్‌బాబును డీఐజీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. బాధ్యతలు స్వీకరించిన రాజేష్ మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం సర్కిల్ పరిధిలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఏ ఒక్కరినీ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. కోడి పందేలు, పేకాట తదితర సంఘ వ్యతిరేక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే గంజాయి తదితర మాదక ద్రవ్యాలు అక్రమంగా రవాణా, విక్రయం చేసినా అటువంటి వారిపై ఉక్కుపాదం మోపుతామన్నారు.

4న గ్రూప్1, 2 అభ్యర్థులకు అవగాహన సదస్సు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్రంలో త్వరలో నిర్వహించబోయే గ్రూప్-1 , గ్రూప్ -2 పరీక్షలకు సన్నద్ధమౌతున్న అభ్యర్థుల కోసం అమిగోస్ 21 సెంచరీ ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 4వ తేదీన ఉచిత అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సు హైదరాబాద్‌లోని అశోక్ నగర్‌లో ఉన్న తమ అకాడమీలో ఉదయం 10 గంటలకు ప్రారంభమౌతుందన్నారు. ఈ సదస్సులో గ్రూప్-1,గ్రూప్-2 సిలబస్, ప్రిపరేషన్ స్ట్రాటజీ, నోట్స్ మేకింగ్, సమయ పాలన తదితర అంశాలపై సీనియర్ అధ్యాపకులచేత సమగ్ర అవగాహన కల్పిస్తామన్నారు. ఈ సదస్సు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో నిర్వహిస్తామన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఇతర వివరాల కోసం 04035052121, 9000230734 నెంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

మూగజీవాలకు ఆహారం అందజేత

జంగారెడ్డిగూడెం : తెలుగు చిత్రసీమలో 350 చిత్రాల్లో నటించి మెప్పించిన ఘనత ఒక్క సూపర్ స్టార్ కృష్ణకే దక్కుతుందని మురళీకృష్ణ మహేష్ యువసేన అధ్యక్షుడు బవిరిశెట్టి మురళీకృష్ణ అన్నారు. సూపర్ స్టార్ కృష్ణ జయంతి పురస్కరించుకుని మురళీకృష్ణ మహేష్ యువసేన ఆధ్వర్యంలో పలు సేవ కార్యక్రమాలు నిర్వహించారు. అందులో భాగంగా గురువారం మూగ జీవాల సంరక్షణార్థం జంగారెడ్డిగూడెంలో పశువులకు, వీధి కుక్కలకు ఆహారం అందించారు. ద్వారకతిరుమల మండలం జి.కొత్తపల్లి ఆడవుల్లోని వానరాలకు అరటిపళ్లు, వేరుశెనగలు ఆహారంగా అందించారు. కార్యక్రమంలో ఎం.రమేష్ , ఎస్ పవన్ చారి, షేక్ సుభాని, పి రాధాకృష్ణ, ఎస్ ప్రశాంత్, ఏ.సీతారామ్, డి.సూరి తదితరులు పాల్గొన్నారు.

లింగపాలెం మండల పరిషత్ ఏవోగా మణికుమారి

లింగపాలెం : లింగపాలెం మండల పరిషత్ కార్యాలయం ఏవోగా మణికుమారి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈమె చింతలపూడి మండల కార్యాలయంలో ఏవోగా పనిచేస్తూ ఇక్కడకి బదిలీపై వచ్చారు.

సంక్షేమ ప్రభుత్వానికి ప్రజల ఆశీస్సులు మెండు

- పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు
- చొప్పరామన్నగూడెంలో గడపగడపకు మన ప్రభుత్వం


చొప్పరామన్నగూడెంలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

కొయ్యలగూడెం : సంక్షేమ ప్రభుత్వానికి ప్రజల ఆశీస్సులు మెండుగా ఉన్నాయని, వచ్చే సార్వత్రిక ఎన్నికలలో మరో మారు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పేర్కొన్నారు. చొప్పరామన్నగూడెం గ్రామంలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలరాజు ఇంటింటికీ పర్యటించారు. గతంలో తెలియజేసిన సమస్యల పరిష్కారమయ్యాయో లేదో తెలుసుకుంటూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా మౌలిక వసతులు కల్పన 85 శాతానికి పైగా పూర్తి అయ్యాయని ప్రజలు పేర్కొంటూ ఉండడంతో ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతిపక్షాల వాళ్ల కోర్టును ఆశ్రయించడం వల్ల నిరుపేదలకు సొంత ఇళ్లు దూరమయ్యాయని ఈ విషయాన్ని వారికి అర్థమయ్యేలా పార్టీ శ్రేణులు తెలపాలని సూచించారు. పంచాయతీ ఎన్నికలు కోర్టు తీర్పుతో ఆగిపోవడం వల్ల పంచాయతీకి పాలకవర్గం లేకుండా పోయిందని, దీంతో తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ప్రజలు తెలపడంతో యుద్ధ ప్రాతిపదికన తాగునీటి సమస్యను పరిష్కరించాల్సిందిగా అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. మలి దఫా గడపగడపకు వచ్చేసరికి తాగునీటి సమస్య అనే మాట ఎక్కడా వినపడకూడదని హెచ్చరించారు. పరింపూడి నుంచి చొప్పరామన్నగూడెం వెళ్లే పుంత రోడ్డును అభివృద్ధి చేయాలని గ్రామస్తులు కోరారు. పింఛన్ల విధానం వల్ల తమ జీవితాలు మెరుగయ్యాయని వృద్ధులు, వితంతువులు, వికలాంగులు పేర్కొంటూ ఉండడంతో బాలరాజు వారికి కృతజ్ఞతలు తెలిపారు. జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి, ఎంపీపీ గంజిమాల రామారావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు, గ్రామ కన్వీనర్ చీమకుర్తి సత్యనారాయణ, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ చిక్కాల దుర్గాప్రసాద్, పార్టీ నాయకులు గంటా రమేష్, కసుకుర్తి వేణు, తగరం ఆశీర్వాదం, తగరం నతానీలు, కూనపోము రామ్మోహన్, బిరుదుగడ్డ ప్రేమ్ కుమార్, వేముల సత్తిబాబు, కనికినేటి సత్యనారాయణ, గుడికుంట్ల సత్యనారాయణ, కె.జీవన్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

వేధింపులపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం : లైంగిక వేధింపులపై మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ ఉమామహేశ్వరరావు తెలిపారు. వివరాల ప్రకారం.. పంగిడిగూడెంకు చెందిన దాసరి శ్రావణి భర్తతో కలిసి కూలీ పనులు చేసుకుని జీవిస్తోంది. గత నెల 24న ఆమె ఒంటరిగా ఉన్న సమయంలో అదే గ్రామానికి చెందిన కుంచే విజయ్‌కుమార్ ఇంట్లోకి ప్రవేశించి అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో ఆమె కేకలు వేయడంతో అతను అక్కడి నుంచి పారిపోయాడు. అప్పటి నుంచి తన కోరిక తీర్చమని లేదంటూ చంపుతానని విజయకుమార్ బెదిరిస్తున్నట్లు శ్రావణి ఫిర్యాదులో పేర్కొందని, ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

తాత్కాలిక ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

టి.నరసాపురం : మండలంలోని అప్పలరాజుగూడెంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాల (బాలుర)లో తాత్కాలిక ప్రాతిపదికన ఉపాధ్యాయులుగా పనిచేసేందుకు ఆసక్తి ఉన్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ టీఎస్ స్వామి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5వ తేదీలోపు అభ్యర్థులు తమ బయోడేటాతో ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలన్నారు. పీజీటీ ఇంగ్లిష్, పీజీటీ గణితం పాఠ్యాంశాలు బోధించేందుకుగాను అభ్యర్థులు ఎంఏ /ఎంఎస్‌సీలో ప్రథమ, ద్వితీయ శ్రేణిలో, బీఈడీ 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించడంతో పాటు టెట్ అర్హత పొందాలన్నారు. అదేవిధంగా 8, 9, 10 తరగతుల బోధనలో కనీసం మూడేళ్ల అనుభవం ఉండాలన్నారు. వివరాలకు పాఠశాలలో సంప్రదించాలన్నారు.

భార్యపై కత్తితో దాడి చేసిన భర్త

చింతలపూడి : ఫాతిమాపురం గ్రామంలో భార్యపై భర్త కత్తితో దాడి చేసిన ఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బొర్రా ప్రసాద్ కొబ్బరి బొండాల వ్యాపారం చేస్తుంటాడు. తరచూ తాగి గొడవ చేస్తుండటంతో భార్య నాగమణి భర్తను మందలించింది. దీంతో ఆగ్రహం చెందిన ప్రసాద్ బొండాలు నరికే కత్తితో కొట్టడంతో ఆమె తలకు గాయాలు కాగా ఆసుపత్రికి తరలించారు. ఎస్సై హరికృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళను కొట్టి గాయపర్చిన నేరంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం : మహిళను కొట్టి గాయపర్చిన నేరంపై ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ పీసీహెచ్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. వివరాల ప్రకారం మండలంలోని మైసన్నగూడెంకు చెందిన వల్లూరి లక్ష్మీకుమారికి ముగ్గురు మగసంతానం. ఆమె చిన్నకుమారుడు వల్లూరి దుర్గాప్రసాద్‌కు వివాహమై ఇద్దరు ఆడపిల్లలు సంతానం ఉన్నారు. మే 31వ తేదీన లక్ష్మీకుమారి చిన్న కోడలు తండ్రి అయిన ఉండ్రాజవరపు దుర్గయ్య సదరు ఆడపిల్లల విషయంలో లక్ష్మీకుమారితో గొడవపడి కిందపడవేశాడన్నారు. అతని వెంటే ఉన్న తగరం పుల్లయ్య అనే వ్యక్తి కర్రతో లక్ష్మీకుమారిని తీవ్రంగా గాయపర్చాడన్నారు. గాయపడిన లక్ష్మీకుమారి స్థానిక ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందిందని, ఆ మేరకు లక్ష్మీకుమారి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

పల్లె పయనం పోస్టర్ల ఆవిష్కరణ

దెందులూరు : రాష్ట్ర చర్మకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు పొలిమేర హరికృష్ణ పల్లె పయనం పేరుతో ముద్రించిన పోస్టర్లను గురువారం దెందులూరు ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద వర్గాల పిల్లలు ఆర్థికంగా వెనుకబడి సాధారణ, ఉన్నత విద్యలకు దూరంగా ఉంటున్నారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థులకు అందిస్తున్న అనేక విద్యా పథకాలను అందిపుచ్చుకుని ప్రతి ఇంటిలోనూ చిన్నారులను తల్లిదండ్రులు విధిగా పాఠశాలలకు పంపి తమ బిడ్డలను చదవించాలన్నారు. పొలిమేర హరికృష్ణ మాట్లాడుతూ పేదవర్గాల చిన్నారులంతా బాలకార్మికులుగా, కూలీలుగా మారి వారి బంగారు భవిష్యత్తును పాడు చేసుకుంటున్నారని, పల్లె పయనం పేరుతో విద్యాభివృద్ధి, విద్య ఆవశ్యకతపై వారికి అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎన్‌వీ నాంచారయ్య, సర్పంచ్ చిలకా వెంకట సుబ్బారావు, ఎంపీటీసీ సొంగా ప్రమీలారాణి, దళిత పెద్దలు ఉన్నారు.

భవన నిర్మాణ కార్మిక సంక్షేమ పథకాలు అమలు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న రామ్‌గోపాల్

జంగారెడ్డిగూడెం : భవన నిర్మాణ కార్మిక సంక్షేమ పథకాలు వెంటనే అమలు చేయాలని తాపీ మేస్త్రీల సంఘం ప్రధాన కార్యదర్శి మామిడి రామ్‌గోపాల్ డిమాండ్ చేశారు. జంగారెడ్డిగూడెం ఏరియా శ్రీ బాలాజీ తాపీపనివారల సంక్షేమ సంఘం జనరల్ బాడీ సమావేశం కండిపల్లి రాజు అధ్యక్షతన గురువారం సంఘం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మామిడి రామ్‌గోపాల్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు 1996లో నిర్మాణ కార్మికులకు ప్రతి రాష్ట్రం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి వారికి సంక్షేమ పథకాలు అమలు చేయాలని తీర్పు ఇచ్చిందన్నారు. దాని ప్రకారం అన్ని రాష్ట్రాలతోపాటు ఆంధ్రప్రదేశ్‌లో కూడా నిర్మాణ బోర్డు వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో 2008లో ఏర్పాటు చేశారన్నారు. అయితే సంక్షేమ పథకాలు సరిగా అమలు జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే లేబర్ ఆఫీసులో డెత్ క్లెయిమ్ డెలివరీ, యాక్సిడెంట్ క్లెయిమ్స్ చాలా పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే వాటిని పరిష్కరించి నిర్మాణ కార్మికులకు పరిహారం అందేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో రాజనాల శ్రీను, మానేపల్లి సూర్యచంద్రం, చిలంతరాజుల శ్రీనివాస్, కండిపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు


కార్యదర్శులతో సమావేశం నిర్వహిస్తున్న డీఎల్‌పీవో ఎండీ రజావుల్లా

టి.నరసాపురం : గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులను జంగారెడ్డిగూడెం డీఎల్‌పీవో ఎండీ రజావుల్లా ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రజావుల్లా మాట్లాడుతూ పంచాయతీల్లో ప్రజా అవసరాలపై కార్యదర్శులు పూర్తి శ్రద్ధ వహించాలన్నారు. తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవడంతో పాటు పారిశుధ్య మెరుగుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. వీధిలైట్ల సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో పన్నులు, పన్నేతరల అంశాలపై కార్యదర్శులను దిశానిర్దేశం చేశారు. అనంతరం టి.నరసాపురం, కేతవరం, తెడ్లం, బండివారిగూడెం గ్రామపంచాయతీల్లోని సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు. టి.నరసాపురం సంపద తయారీ కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి ఎన్‌టీ స్వామి, కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను కఠినంగా శిక్షించాలి



జంగారెడ్డిగూడెంలో ఆందోళన నిర్వహిస్తున్న ఇఫ్టూ నాయకులు

జంగారెడ్డిగూడెం : భారత మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడ్డ భారత రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను కఠినంగా శిక్షించాలని ఇఫ్టూ రాష్ట్ర కోశాధికారి కేవీ రమణ డిమాండ్ చేశారు. గురువారం ఇఫ్టూ జంగారెడ్డిగూడెం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ధర్మన్న స్మారక భవనం వద్ద రెజ్లర్లకు సంఘీభావం, ప్రభుత్వ తీరుపై నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీ రమణ మాట్లాడుతూ 2016 సంవత్సరం నుంచి భారత రెజ్లింగ్ ఫెడరేషన్‌లో మహిళా క్రీడాకారులపై లైంగిక వేధింపులకు పాల్పడ్డట్టు బ్రిజ్ భూషణ్‌పై పలుమార్లు ఆరోపణలు వస్తున్నా, సుప్రీంకోర్టు జోక్యంతో పోలీసు కేసు నమోదైనా ఇప్పటికీ అతనిపై శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను అరెస్ట్ చేయాలని లేకుంటే దేశవ్యాప్తంగా ఉద్యమం విస్తరిస్తుందని కేంద్రాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ డివిజన్ ప్రధాన కార్యదర్శి మంచిలి రాజు, కోట శివకృష్ణ, అవుల పుల్లారావు, తియ్యల గణేష్, వనపర్ల నవీన్, ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల విజేతలకు బహుమతుల అందజేత


టోర్నమెంట్ కప్పు అందుకుంటున్న బాదరాల క్రికెట్ టీం

లింగపాలెం : బాదరాల గ్రామంలో జరిగిన క్రికెట్ టోర్నమెంట్‌లో గురువారం విజేతలకు వైఎస్సార్ సీపీ నేతలు బహుమతులు అందజేశారు. గత 15 రోజులుగా జరిగిన ఈ పోటీల్లో 20 టీంలు పాల్గొన్నాయి. మొదటి స్థానంలో నిలిచిన బాదరాల టీంకు దాత, ఏలూరు జిల్లా వైఎస్సార్‌సీపీ యువజన విభాగ అధ్యక్షుడు పడమటి గిరిబాబు రూ 30 వేలు నగదు అందజేశారు. రెండోవ స్థానాన్ని కైవసం చేసుకున్న రామశింగవరం టీంకు రూ.20 వేల నగదును దాతలు లింగపాలెం జెడ్పీటీసీ వడ్లాని హరినాథ్ రాజు, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కె మోహనరావు, ములగలంపాడు సర్పంచ్ ఇనుగంటి రాజేష్ అందజేశారు. మూడోవ స్థానంలో నిలిచిన నాగులదేవిపాడు టీంకు రూ.10 వేల నగదును దాతలు వైఎస్సార్ సీపీ నాయకుడు కోటగిరి ధీరాజ్ కృష్ణ, బాదరాల సర్పంచ్ బొల్లినేని శ్రీనివాసరావు అందజేశారు. క్రీడాకారులకు రెండు క్రికెట్ కిట్‌లను వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కన్వీనర్ ఎం.వేణు రెడ్డి అందజేశారు. విజేతలకు బహుమతి కప్పును దాత గాదే హనుమాన్ రెడ్డి అందజేశారు.

6న కె.కోటలో 150వ రోజు 'గడపగడపకు'


లింగపాలెంలో మండల పార్టీ నాయకులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

లింగపాలెం : చింతలపూడి నియోజకవర్గంలో గడపగడపకు మన ప్రభుత్వం 150వ రోజు కార్యక్రమం ఈనెల 6వ తేదీన కామవరపుకోటలో నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా తెలిపారు. ఈమేరకు లింగపాలెంలో వైఎస్సార్ సీపీ నేత బీవీఎస్ రెడ్డి గెస్ట్‌హౌస్ ఆవరణలో గురువారం రాత్రి పార్టీ మండల నేతలతో ఆయన చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎలీజా మాట్లాడుతూ కామవరపుకోటలో జరిగే 150వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో నియోజకవర్గం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నవరత్నాల ద్వారా పేదలకు భరోసా కల్పిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా అండగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ మండలపు సాయిబాబు, పార్టీ మండల ముఖ్యనేత ముసునూరి వెంకటేశ్వరరావు, మండల సచివాలయ కన్వీనర్ అన్నపనేని శాంతరావు, మండల సేవాదళ్ అధ్యక్షుడు రెడ్డి బాబ్జి, సర్పంచ్‌లు తాడేపల్లి శాంతరావు, డి.రవీంద్ర, ఏఎంసీ డైరెక్టర్ కుప్పాల రామకృష్ణ, నాయకులు మండలపు నరశింహరావు, బి.ప్రభాకరెడ్డి, పి వేమనరెడ్డి, మేకల రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

పెదపాడు : మండలంలోని ఏపూరు సబ్‌స్టేషన్ పరిధిలోని అప్పనవీడు, తాళ్లముడి, ఏపూరు పరిసర ప్రాంతాల్లో లైన్లు మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి.శశిధర్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

పెడన మున్సిపల్ కమిషనర్‌గా మహేంద్ర

ఏలూరు టౌన్: ఏలూరు నగరపాలక సంస్థలో శానిటరీ ఇన్స్‌పెక్టర్‌గా పనిచేస్తోన్న బంటుమిల్లి మహేంద్రను కృష్ణాజిల్లా పెడన పురపాలక సంఘానికి కమిషనర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సుమారు రెండు దశాబ్దాల పాటు ఏలూరు నగరంలో విశేష సేవలు అందిస్తూనే, మరోవైపు తన ఉద్యోగంలో వర్గోన్నతి పొందేందుకు ఆయన డిపార్ట్‌మెంటల్ పరీక్షలు రాస్తూ విజయం సాధించారు. ఒకవైపు సర్వీసులో సీనియార్టీ సాధించటం, మరోవైపు ఉన్నత విద్యను అభ్యసించటం ద్వారా శానిటరీ ఇన్స్‌పెక్టర్ నుంచి మున్సిపల్ కమిషనర్‌గా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్‌గా పదోన్నతి పొందటం ఆనందంగా ఉందన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పనిచేస్తూ ప్రజలకు ఉత్తమ సేవలు అందించేలా కృషి చేస్తానని చెప్పారు. చిన్నపాటి ఉద్యోగంలో చేరి నేడు కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టడం సంతోషాన్నిస్తుందన్నారు.

మలేరియా జ్వరాలపై అశ్రద్ధ వద్దు

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఆశ

ఏలూరు టౌన్: మలేరియా జ్వరాలు పట్ల ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఏలూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డీ.ఆశ, జిల్లా మలేరియా అధికారి పీఎస్ఎస్ ప్రసాద్ తెలిపారు. మలేరియా నివారణ మాసోత్సవం సందర్భంగా బ్యానర్‌ను గురువారం కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ మలేరియా జ్వరాలు ప్రపంచంలోని అన్ని దేశాల్లోనూ ఉన్నాయనీ, ముఖ్యంగా ఆఫ్రికా, ఆసియా ఖండాల్లో అత్యధికంగా మలేరియా జ్వరాలతో బాధపడుతున్నారని తెలిపారు. మలేరియా జ్వరాలను అశ్రద్ధ చేస్తే మరణాలు సంభవిస్తాయని, మలేరియా జ్వరాన్ని చలి జ్వరంతో బాధపడుతున్నారని తెలిపారు. మలేరియా కారక దోమ ఆడ అనాఫిలిస్ ఇంటిలోపల ఇంటి బయట ఉండే మంచినీటి నిలువ ప్రాంతాల్లో పెరుగుతాయని తెలిపారు. ప్రజలు వారానికి ఒకసారి నీటి నిల్వ ప్రాంతాలైన నీళ్ల తొట్లు కడిగి మూతలు పెట్టుకోవాలనీ, రుబ్బురోళ్లు, డ్రమ్ములు నిత్యం శుభ్రం చేసుకోవాలన్నారు.జూన్ నెలంతా పీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్లలోనూ విస్తృతస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా మలేరియా అధికారి ప్రసాద్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో మలేరియా చాలావరకు తగ్గుముఖం పట్టిందనీ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో మలేరియా పరీక్షలు ఉచితంగా చేస్తారనీ, మందులు ఇస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రత్నకుమారి, ఏవో మురళీకృష్ణ, డీపీహెచ్ఎన్‌వో మనోరమ, డెమో నాగరత్నం, విజయ్, అసిస్టెంట్ మలేరియా అధికారి జే.గోవిందరావు సిబ్బంది ఉన్నారు.